# కర్నూలు | నంద్యాల వార్త

27 అక్టోబర్ , 2024 ఆదివారం పేజీలు 4


## జిల్లాలో కొత్తగా 3 స్కానింగ్ కేంద్రాలకు.. అనుమతి

**- జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా**

**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** జిల్లాలో కొత్తగా మూడు స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటి కమిటీ (పిసి అండ్ పిఎన్‌డిటి యాక్టు) అమోదం తెలపడం జరిగిందని జిల్లా కలెక్టరు పి రంజిత్‌బాషా తెలిపారు. శనివారం కలెక్టరు చాంబర్‌లో పిసి అండ్ పిఎన్‌డిటికి సంబంధించిన జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటి కమిటీ సమావేశాన్ని కలెక్టరు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు ముందుగా జిల్లాలో పిసి అండ్ పిఎన్‌డిటి యాక్టు అములుపై వైద్యాధికారులతో చర్చించి తగు సూచనలు ఇచ్చారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టరు వైద్యాధికారులను అదేశించారు. అడపిల్లల సంరక్షణ కొరకు జిల్లా అంతట అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టరు వైద్యశాఖ అధికారులకు సూచించారు. తదనంతరం జిల్లాస్థాయి సలహా కమిటీ తనిఖీచేసి సిఫారసు చేసి మూడు కొత్తస్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు 9 రెన్యూవల్స్ కు, 6 సవరణలకు సంబంధించిన ధరఖాస్తులను కమిటీ అమోదించడం జరిగిందని కలెక్టరు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా జడ్జీ భూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టరు చల్లా కళ్యాణి, డిఎంహెచ్ఓ డా.భాస్కర్, నోడల్ అఫీసర్ డా.నాగ ప్రసాద్‌బాబు, ఎన్‌జిఓ ప్రతినిధి డా.బాలమద్దయ్య, ఎస్ఐ ప్రేమ, ప్రొగ్రామ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుంది

**మంత్రి టీజీ భరత్, టిడిపి జిల్లా పార్లమెంటు అధ్యక్షులు పి తిక్కారెడ్డిలు**




**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పార్టీ కార్యకర్తల కోసం పార్టీ సంక్షేమ నిధి ఏర్పాటు చేసి కార్యకర్తలకు అండగా నిలిచారని మంత్రి టీజీ భరత్, టిడిపి జిల్లా పార్లమెంటు అధ్యక్షులు పి తిక్కారెడ్డిలు అన్నారు. జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్ లతో కలిసి పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్, పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజులకు ముందుగా పార్టీ సభ్యత్వ నమోదు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడ పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి అపత్కాలంలో అదుకున్న ఏకైన పార్టీ తెలుగుదేశం పార్టీ అని గతంలో పార్టీలో క్రియాశీలక సభ్యులుగా సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద భీమా రెండు లక్షల రూపాయల మాత్రమే ఉండేదని ప్రస్తుతం క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే అలాంటి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా పెంచడం జరిగింద న్నారు. దీనికి మన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చోరవే అన్నారు. అదేవిధంగా మరణించిన కార్యకర్త అంతిమ క్రియలకు రూ.10 వేలు అందజేయడం జరుగుతుంద న్నారు. ప్రమాదంలో మరణించిన వారి పిల్లలకు ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్, నాయకులు వై నాగేశ్వర్‌యాదవ్, కే నాగేంద్ర, పి రవికుమార్, యస్ ముంతాజ్, పద్మలతా రెడ్డి, కెవి సుబ్బారెడ్డి, సత్రం రామకృష్ణుడు, డి జేమ్స్, పి హనుమంతరావు చౌదరి, బి క్రిష్ణుడు, తిలక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు.. సత్వరమే పరిష్కరించాలి

- కార్పొరేటర్లు తెలిపిన సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు
- పారిశుద్ధ్యం, తాగునీటిపై సమస్యలపై ప్రత్యేక దృష్టి : మంత్రి టీజీ భరత్



**కర్నూలు మున్సిపల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో నగర అభివృద్ధి పనులపై నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత సచివాలయ అడ్మిన్లతో మంత్రి సమావేశమయ్యారు. సచివాలయ సిబ్బంది స్థానిక కార్పొరేటర్‌లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఏవైనా కష్టతరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ముందుగా గత నెల 30న నిర్వహించిన సమీక్షకు సంబంధించిన పనుల పురోగతిని మంత్రికి అధికారులు వివరించారు. అనంతరం తాగునీటి సమస్య పరిష్కరానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రతి ఇంటికి పగటిపూటే నీరు అందించే లక్ష్యానికి సంబంధించి పురోగతి, చేపట్టిన చర్యలపై మంత్రి అరాతీశారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అదేశించారు. పార్కు స్థలాల అన్యాక్రాంతం, రహదారుల అక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అదేశించారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా అర్బన్ డెవలప్‌మెంట్‌పై మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అలాగే ట్రాఫిక్ రద్దీ నివారణకు రహదారుల నిర్మాణం, విస్తరణ, పనులకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బళ్లారి చౌరస్తా నుండి బస్టాండ్ వద్దకు ఎస్ఏపీ క్యాంపు మీదుగా రహదారి నిర్మాణానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియ ఐజి స్థాయిలో ఉందని త్వరలో అన్ని పూర్తి అయి పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఆరోగ్య అధికారి కె విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్వో జునైద్, డిసిపి సంధ్యా, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం

**హాలహర్వి, అక్టోబర్26, ప్రభాతవార్త;** కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే తుంగభద్ర జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతోందని డ్యాం అధికారులు శనివారం తెలిపారు. ఉదయం 19,858 క్యూసెక్కుల నీరు చేరిందన్నారు. ప్రస్తుతం జలాశయంలో 101.61 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు. జలాశయం నుంచి వివిధ కాలువలకు 15,290 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.



## తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదిరాళ్ళు -ఎం.పి.

**నందికొట్కూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ప్రపంచ వ్యాప్తంగా వెలుగొందడానికి కార్యకర్తలే పునాదిరాళ్ళని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా.బైరెడ్డి శబరి అన్నారు. శనివారం తమ పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని కోలాహలంగా ఎం.పి.ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎం.పి.మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో సభ్యత్వాల నమోదు ప్రారంభం అయిందని ఈ రోజు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సభ్యత్వాన్ని నమోదును రెన్యూవల్ చేసుకొని ప్రారంభించార న్నారు. పార్టీ అధికారం చేపట్టగానే కార్యకర్తలను పక్కన పెట్టే పార్టీలు ఉన్నాయని, తెలుగుదేశం నిరంతరం కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తుందని, రూ.100 లు సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షలు భీమా వర్తిస్తుందని కార్యకర్త కుటంబానికి ఇది పెద్ద భరోసా అని ఆమె తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎం.పి.తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పోరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, చెరుకు అశోకరత్నం, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వివిధ మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యార్థి దశలోనే పోలీసుల విదులు, బాధ్యతలు.. తెలుసుకోవడం మంచిది-యస్‌పి



**నంద్యాల, అక్టోబరు 26, ప్రభాతవార్త ప్రతినిధి**

విద్యార్థి దశలోనే పోలీసుల బాధ్యతలు వారి విదుల గురించి తెలుసుకోవడం చాలా మంచిదని జిల్లా యస్‌పి అదిరాజ్‌సింగ్ రానా చెప్పారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలో బాగంగా ఓపన్ హౌస్ ఎగ్జిబిషను యస్‌పి శనివారం ప్రారంభించారు. విద్యార్థి దశలో పోలీసుల విదులు బాధ్యతలు తెలుసుకుంటే జీవితంలో ఎంతో దోహద పడతాయని యస్‌పి చెప్పారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి అక్టోబరు 21 నుంచి 31వరకు నిర్వహించే సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. వారోత్సవాలకు యస్‌నపి రాగనే పోలీసు జాగిలయం హానీమరియు హ్యాండ్లర్ నుండి గౌరవ వందనము స్వీకరించారు. అనంతరము పోలీసులు విది నిర్వహణలో ఉపయోగించే అయుదాలు వాటి పినతీరు పరికరాలు సాంకేతిక సాదనలను గురించి యస్‌పి విద్యార్థులకు వివరించారు. ప్రదర్శనలో ఉంచిన అయుదారులు ఈ ఓపన్ హౌస్ కార్యక్రమంలో పోలీసులు వాడే 410డిపి మస్కట 7,62యంయం బోల్ట్ యాఒన్ రైఫల్ 9యంయం కార్బన్ 9యంయం పిస్టిల వియల్ 16యంయం పిపి ఫెడరల్ గ్యాస్‌గన్ 303 రఫిల్ ఫైబర్‌లాఠీ హెల్మెట్ స్టోక్ గార్డ్ద బాడీ ప్రొటెక్టోర్, పోలీసు వయర్‌లేస్, కమ్యూనికేషన్ ట్రాపిక్ పోలీసులు వాడే పరికరాలు హాండ్ హెల్డ్ మెటల్ డిఒక్టోర్ డిప్‌సర్చ్ మెటల్ డిఒక్టోర్ డోర్ ఫ్రేమ్ మెటల డిటెక్టోర్ మొదలగు పరికరాలు అవి పని చేయు విదానము చూపించారు. ఈసందర్భముగా యస్‌నపి పోలీసు అమరవీరులను స్మరించుకోవడముతో పాటు సమాజములో పోలీసుల పాత్ర విదులు త్యాగాలపై ప్రజల్లో అవగామణ కల్పించేందుకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు పోలీసు విదుల వారు వాడే అయుదాఉలు పరికరాలు శాంతి భద్రతల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోవడానికి ఈ ఓపన్‌హౌస్ కార్యక్రమము దోహదపడుతుందన్నారువిద్యార్థులు చక్కగా చదువుకుని క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈకార్యక్రమంలోజిల్లా యస్‌పితో పాటు అడిషనల్ యస్‌పియుగందర్ బాబు అర్మ్మాడు రిజర్వు ఇస్పెక్టరు స్పెషల్ బ్రాంచీ ఇప్పెక్టర్లు పోలీసు సిబ్మంది పాల్గొన్నారు.

## మంత్రి బీసీ దంపతులను ఆహ్వానించిన యాగంటి ఆలయ ఈవో



**బనగానపల్లె, అక్టోబర్26, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డి దంపతులను యాగంటి ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు కలిసి యాగంటిలో నిర్వహించే కార్తీకమాసోత్సవాల్లో పాల్గొనాలని వారికి ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం ఆలయ ఈవో చంద్రుడు శ్రీ ఉమామహేశ్వరస్వామి జ్ఞాపికను మంత్రి బీసీ దంపతులకు అందజేశారు. ఈవో వెంట యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ మౌలీశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యమయ్యలు ఉనా న్నరు.

## పోలీసులు నిత్యం వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

**- రెండురోజుల పాటు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం**

**కర్నూలు విద్య, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతి ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ జి బిందు మాదవ్ ప్రారంభించారు. పోలీస్ విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థులు విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండడం మంచిందని జిల్లా ఎస్పీ సూచించారు. ఓపెన్ హౌస్‌లోని ఆయుధాల గురించి విద్యార్తులకు జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు. ఎలాంటి సందర్భంలో ఏ ఆయుధం ఉపయోగిస్తారు వాటి పనితీరు గురించి తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ వ్యవస్థ పనితీరు గురించి పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు 22 రైఫిల్, 410 మస్కెట్, 303 రైఫిల్, 303 జిఎఫ్ రైఫిల్, 303 ఎల్ ఎం జి, 762 ఎం ఎం బార్, 762 ఎంఎంఎస్ఎల్ఆర్, 762 ఎల్ఎంజి, 5.56 ఎంఎం ఇన్సాస్ రైఫిల్, ఏకె 47, 9 ఎంఎం కార్బైన్, 9 ఎంఎం పిస్టోల్, 9 ఎంఎం గ్లాక్ ఫిస్టోల్, 380 రివాల్వర్, 12 బోర్ పంప్ యాక్సన్ గన్ 51 ఎంఎం మోటారు తదితర ఆయుదాలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ, జువేద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీశైలం క్షేత్రం లో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన.

**శ్రీశైలం ప్రాజెక్టు, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రం కు వచ్చే నెల 9వ తేదీన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో శనివారం నాడు నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గనియ జిల్లా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ముందుగా శ్రీశైలం లో గల ఏపీ టూరిజం నిర్వహిస్తున్న రోప్ వే వద్దకు చేరుకోవడం జరిగింది.అక్కడ నుండి పాతాళ గంగ దిగువ ప్రాంతానికి చేరుకొని పాతాళ గంగ సమీపంలో ప్రకాశం బ్యారేజీ నుండి శ్రీశైలం వరకు సి ప్లైన్ ( ఏరో డ్రోం%శీ%) విధాన అమలు తీరును పరిశీలించడం జరిగింది. ఈ యొక్క ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమగ్ర సమాచారం అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. తదుపరి సుండుపెంటలో గల ఐటిడిఏ కార్యాలయమును పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఆర్డిఓ దాసు, శ్రీశైలం దేవస్థానం ఇన్చార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి , దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి ,శ్రీశైలం ఇరిగేషన్ శాఖ ఎస్సీ శ్రీరామచంద్రమూర్తి ,ఆత్మకూరు అటవీశాఖ డీఎఫ్ఓ, ఆత్మకూరు డిఎస్పి రామాంజనేయ నాయక్ , ఏపీ టూరిజం శాఖ అధికారి పెంచల్ రెడ్డి ,శ్రీశైలం వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు తదితర అధికారు లు పాల్గొన్నారు.



## దొంగలు దొరికారు..!

**- ముగ్గురు దొంగలు అరెస్ట్: సొమ్ము స్వాధీనం..**

**ఎమ్మిగనూరు, అక్టోబరు 26, ప్రభాతవార్త** దొంగతనం చేసి ఎవరికి దొరకకుండా తిరుగుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు ఎట్టికేలకు పట్టుకున్నారు..గత కొంత కాలంగాపోలీసులకు సవాలు విసురుతూ దొంగతనాలు చేస్తున్న బోయ దేవేంద్ర, పిల్లిగోవు సురేష్, సూర్య నారాయణ అనే ముగ్గురు దొంగలు దొరికారు.. శనివారం పట్టణ సిఐ సుదర్శన రెడ్డి వారిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.లక్ష,50వేల నగదును స్వాధీనం చేసుకున్నారు..అనంతరం సిఐ సుదర్శన రెడ్డి కేసు గురించి వివరించారు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఈ ముగ్గురు గత ఫిబ్రవరి నెల 6వ తేదిన అమృత రెస్టారెంట్‌లో పనిచేస్తున్న మిన్నప్ప అనే వ్యక్తిపై దాడి చేసి కంట్లో కారం చల్లి అతని నుండి రూ.లక్ష, 50వేల నగదును దొంగలించుకుని వెళ్లినట్లు తెలిపారు.. కాగా బాదితుడు మిన్నప్ప ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించినట్లు తెలిపారు.. ముఖ్యంగా ఈ దొంగతనాలే కాక గోనేగండ్ల, కౌతాళం మండలాల్లో కూడా పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఫిర్యాదుల ద్వారా తెలిసిందన్నారు.. వాటిపై కూడా దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు..ఈ మేరకు ముగ్గురిపై కాపు కాసి శనివారంఉదయం దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.. ఈ మేరకు ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు ఈ కేసులో హెడ్‌కానిస్టేబుల్ మురళీధర్ రెడ్డి, పోలీసులు హుస్సేన్, సత్యరాజు, లక్ష్మన్నలు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఈ ముగ్గురు దొంగలను పట్టుకున్నట్లు సిఐ సుదర్శనరెడ్డి విలేకర్లకు తెలిపారు..



## తెదేపా సభ్యత్వ నమోదును ప్రారంభించిన.. గుడిసె ఆది కృష్ణమ్మ




**ఆదోని, అక్టోబరు 26, ప్రభాతవార్త**

మండల పరిధిలోని నాగనాథనహళ్లి గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ తన సభ్యత్వ నమోదు తీసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు తప్పక పార్టీ సభ్యత్వ నమోదు తీసుకోవాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం గ్రామప్రజలు సభ్యత్వ నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగనాథనహళ్లి తెదేపా నాయకులు కె రవికుమార్, బోయ మూకప్ప, వీరేష్, తిరుమల రాజు, చిన్న సుధాకర్, అయ్యప్పరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండగిరి బాబురావు, చిన్న, చిరంజీవి, ఆంజనేయులు, బైచిగేరి రాజకుమార్, రాఘవరెడ్డి, మంత్రికి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే కూటమి ప్రధాన ఎజెండా -ఎమ్మెల్యే బీవీ

**గోనెగండ్ల అక్టోబరు 26 ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్దే కూటమి ప్రధాన ఎజెండా అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో ఆయన పర్యటించారు. జలజీవన్‌మిషన్ రూ.58 లక్షల నిధులతో నిర్మించే తాగునీటి పథకంకు భూమి పూజ చేశారు. అలాగే గ్రామంలో పలు వీదులలో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అడిగి ప్రశ్నలకు ఓపిగా సమాదనం ఇచ్చారు. అనంతరం ప్రజల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు గాను జలజీవన్ మీషన్ పథకం కింద పనుల శరవేగంగా జరుగుతాయని ప్రతి ఇంటికి ఉచిత కొళాయి ఇస్తున్నామన్నారు. గ్రామంలో 178 కోళాయి ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు సంక్షేమ పథకాలు అమలు జరిపామన్నారు. దీపావళికి ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు జరుపుతున్నామని తెలిపారు. దీంతో ప్రతి మహిళకు ఎంతో మేలు జరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో విడతలో వచ్చే నిధులతో చిన్నమరివీడు గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజి పనులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, నూర్‌అహ్మద్, షేక్షావలి, వినోద్‌గౌడ్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చిన్ననేలటూరు నాగన్న, ఎర్రబాడు శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, పెద్దయ్య, రాజేష్, రాంపురం రఫి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థినీలు ఎంపిక



**ఆత్మకూరు, అక్టోబర్26, ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థీనీలు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడం హర్షించదగ విషయమని స్కూలు కమిటి చైర్మన్ ఖాజావలి, ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయమ ఉపాధ్యాయుడు శంకర్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని బాలికొన్నత పాఠశాల విద్యార్థీనీలు శివకీర్తి, సలోమిలను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వతరగతి చదువుతున్న సి.శివకీర్తి ఖోఖో యందు అండర్ -17 విభాగము నందు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ కి ఎన్నిక అయిందన్నారు. సలోమి యోగా అండర్ -17 విభాగం నందు ఎంపికైన్నట్లు తెలిపారు. విద్యార్థులు అభివృద్ధికి ఆటలు ముఖ్యమని తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థీనీలను అభినందించారు.

## నాటు సారా స్థావరాలపై దాడులు

**: 1400ల లీటర్ల బెల్లం ఊట ద్వంశం**

**ఆత్మకూరు, అక్టోబర్26, ప్రభాతవార్త:** నాటుసారా స్థావరాలపై నిరంతరం దాడులు చేస్తుంటామని ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. కిషోర్ కుమార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి, జగదీష్‌లు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్టాలచెరువు గ్రామ శివారులోగల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారికి సిద్దంగా ఉంచిన 1400ల లీటర్ల బెల్లం ఊట ద్వంశం చేయడం జరిగిందన్నారు. ఈ దాడులో కానిస్టేబుల్స్ రామచంద్రుడు, బాదుల్లా, కృష్ణుడు, సత్యనారాయణ రాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యంపై దాడి

**ఆత్మకూరు, అక్టోబర్26, ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రధాని మోడి జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ఏ.దనుంజయ్య మిటింగ్ హాల్ నందు సిపిఎం పట్టణ కమిటి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉందని, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రజలను ఆలోచించనీయకుండా ప్రధాని మోడి జమిలి ఎన్నికల అంశాన్ని ఎజెండాగా తీసుకొచ్చారని తెలిపారు. మహరాష్ట్ర, జార్ఖండ్ వంటి రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నందున అక్కడి ప్రజలు వారి సమస్యలపై కాకుండా జమిలి ఎన్నికల అంశంపై మాట్లాడేలా మోడి ఆ అంశాన్ని ఎజెండా తీసుకొచ్చారని చెప్పారు. మోడి తీసుకొచ్చిన జమిలి ఎన్నికలను సమర్థిస్తున్నారని విమర్శించారు. జమిలి ఎన్నికలపై పాలకులు చెబుతున్న కారణాలేవి నిజం కాదని, వారికే వేరే ఎజెండా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు రణదీర్, రామ్‌నాయక్, స్వాములు, సురేంద్ర, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, దినేష్, సద్దాం, మంజుల తదితరులు పాల్గొన్నారు.




## పశువులపై కత్తితో సైకో స్వైర విహారం..

**- పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు... - ఆందోళనలో పశువులు యజమానులు**

**గోనెగండ్ల అక్టోబరు 26 ప్రభాతవార్త**

మండల కేంరదమైన గోనెగ ండ్లలోని పలు వీదులలో గుర్తు తెలియని సైకో శుక్రవారం రాత్రి నుంచి రాత్రి పూట వీదుల్లో తిరుగుతూ కనిపించిన ఆవులను, ఎద్దులను, బర్రెలను, గొర్రెపిల్లలను కత్తితో తీవ్రంగా గాయపరుస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 20ఆవులు, ఎద్దులను గాయపరిచాడు. అలాగే రెండు బర్రెలను ఆరు గొర్రెలను గాయపరిచినట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. గ్రామంలోని చింతలాముని నల్లారెడ్డి స్వామికి చెందిన 10 ఆవులను గాయపరచడం గ్రామంలో చర్చనీయాంశాంగా మారింది. గ్రామ పెద్దలు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. వీదులలో ఆడుకునేందు పిల్లలను తల్లిదండ్రులు బయటకు పంపడం లేదు. అలాగే సీఐ గంగాధర్ మాట్లాడుతూ అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే 9121101074 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. లక్ష్మిపేట, బీసీ కాలనీలో పశువుల యజమానులకు తగు సూచనలు చేశారు. ఇప్పటికైన పోలీసులు మూగజీవాలపై దాడికి పాల్పడుతున్న సైకోను వెంటనే అరెస్టు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## నాలుగు యాప్ లను ఒక యాప్ గా మార్చాలి

**నందికొట్కూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** సెల్‌లో వేస్తున్న నాలుగు యాప్ లను ఒక యాప్‌గా మార్చాలని కోరుతు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసిడియస్ కార్యాలయం వద్ద ధర్నా చేసి సిడిపిఓ కోటేశ్వరికి వినతి పత్రం అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి జి.సేభా, నిర్మల, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలక్రిష్ణ మాట్లాడుతు ప్రింటెడ్ రిజిష్టర్లు ప్రభుత్వం సరఫరా చేయాలని, రేషన్ షాప్‌లో నుంచి వచ్చిన సరుకులను సక్రమంగా అంధించాలని, అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చిన సరుకులైన ఎగ్స్, బాలామృతం అంగన్వాడీ కేంద్రాలకు ఇవ్వాలని, పోషన్ ట్రాకర్‌ను ఈకేవైసి నిలుపుదల చేయాలని, అంగన్వాడీ సమ్మె కాలంలో ఇచ్చినటు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆరు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాఈ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.మదార్‌బీ, బి.శిలక్ష్మి, శైలజ, జయలక్ష్మి, ప్రసన్న, పద్మావతి, వెంకటరమణమ్మ, సాజిదా, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



## డిఈఓను మర్యాదపూర్వకంగా కలిసి అపుస్మా అధ్యక్షులు అమిర్ బాషా

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి పి జనార్థన్‌రెడ్డిని అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు టి అమిర్ బాషా శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనకు ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం, శ్రీలక్ష్మి నరసింహాస్వామి దర్శనానికి రావాలని ఆహ్వానించారు.



## రైతులకు సాగునీరు అందించాలి

**కొత్తపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** గ్రామాల్లో ఉన్న రైతుల పొలాలకు సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు యేసు రత్నం తెలిపారు. శనివారం మండలం కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న సరస్వతి పాఠశాల అవరణలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సంజీవరాయుడు అధ్యక్షతన సిపిఎం పార్టీ మండల రెండవ మహాసభ నిర్వహించారు. ముందుగా సిపిఎం పార్టీ జెండా అవిస్కరణ నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు స్వాములు సమావేశంలో పార్టీ కోసం ప్రజా సమస్యల కోసం అమరులైన పలువురికి నివాళ్లు అర్పించేందుకు సంతాపతీర్మాణం ప్రవేశపెట్టారు. అనంతరం కొత్తపల్లి మండలంలో ఉన్న రైతులకు సాగునీరు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్నారు. మంలంలో ఉన్న ఎత్తిపోతల ద్వారా చెరువులను నీటితో నింపాలన్నారు. జడ్డు వారి పల్లి, ఎదురుపాడు, బావాపురం, లింగాపురం, నందికుంట, దుద్యాల, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న మెట్ట భూముల రైతుల పొలాలకు సాగునీరు ఇవ్వాలి. దళిత గిరిజన సమస్యలపై కేంద్రీకృతం చేసి పనిచేయాలి, జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. అనంతరం కొత్తపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం పార్టీ మండల కన్వీనర్‌గా ఎన్ స్వాములు, కమిటటీ సభ్యులుగా సంజీవరాయుడు, ఎన్ దాసు, జి దాసు, కే దినేష్, సత్యరాజు, జ్ఞానసూర్యుడు, యేసన్నలను కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా తీర్మాణించడం జరిగింది. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసు, దేవకుమార్, ఏసన్న, జ్ఞానవరం, రాజేష్, గోపాల్, ధర్మరాజు, దినేష్, భరత్ చిన్నస్వామి, పలువురు పాల్గొన్నారు.



## వైసిపి పార్టీ జిల్లాల క్యాడర్ నియామకం



**కర్నూలు అర్బన్ సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాల నియామక ప్రక్రియ కొరకై పార్టీ అధ్యక్షులు ఆదేశానుసారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గృహంలో కర్నూలు వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి సమక్షంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాస్థాయి మండల స్థాయి మున్సిపాలిటీలు కార్పొరేషన్లు నాలుగు కష్టార్లు చేసి పార్టీ అధ్యక్షులు నియమించి వారికి దోహద. పడే విధంగా కార్యదర్శులు సెక్రటరీలు కోశాధికారులుగా న నియామకం కై, ఈ ప్రక్రియ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఈ మధ్యకాలంలో అమరావతిలో ఉండే కేంద్ర పార్టీ కార్యాలయంలో చేయడం జరిగిందని తెలిపారు. అలాగే కర్నూలు జిల్లా నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ఎస్వి మోహన్ రెడ్డి కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇక్కడ చాలామందిని నియమించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా మండల స్థాయిలో 28 అనుబంధ సంస్థలు ఉన్నాయని వాటికి అధ్యక్షులను నియమించడం జరిగితే జిల్లా నియామకం పూర్తవుతుంది అని అన్నారు. అలాగే నియోజకవర్గ ఇంచార్జ్‌కు శాసనమండలి సభ్యులకు గాని మాజీ పార్లమెంటు సభ్యులకు గానీ తెలియజేపి కర్నూలు జిల్లా నంద్యాల జిల్లా పార్టీ నాయకులతో ఈ కార్యక్రమాన్ని ఈరోజు సమీక్షించడం జరిగింది అలాగే పత్తికొండ నియోజకవర్గం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని పార్టీ కొరకు పాటుపడతారని ఈ కార్యక్రమం పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు అలాగే ఈ కార్యక్రమం తర్వాత నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా మండల వర్గ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాలు పెట్టుకోవడం జరుగుతుందని పార్టీ పటిష్టతో పాటు రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరందరికీ సముచిత స్థానం కల్పించి పార్టీ వారికి అన్ని విధాల అండగా ఉండడమే కాకుండా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కర్నూలు వైసిపి పార్టీ ఎస్వీ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కర్నూలు నంద్యాల జిల్లాల ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు ప్రస్తుత ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్

**బనగానపల్లె, అక్టోబర్26, ప్రభాతవార్త:** బనగానపల్లె మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని దేవాదాయ, ధర్మదాయశాఖ మల్టీజోన్-2 రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ శనివారం దర్శించుకున్నారు. ఈ మేరకు చంద్రశేఖర ఆజాద్ ఆలయానికి చేరుకోగానే ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు అసిస్టెంట్ కమిషన్ జి.కామేశ్వరమ్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేదపండితులు, అర్చకులు ఆజాద్ చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహింపజేశారు. తదుపరి ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సత్యం గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ మరియు శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయ ఈవో రామాంజనేయులు, సుబ్బరాయునికొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఈవో రామకృష్ణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రేపు యాగంటిలో వేలంపాటలు

**బనగానపల్లె, అక్టోబర్26, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో 28వ తేది సోమవారం ఉదయం 10గంటలకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బి.చంద్రుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుతోపాటు తలనీలాలు, కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కు కొరకు సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలాలు దేవాదాయ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తి కలవారు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునని ఇతర వివరాల కొరకు ఆలయ కార్యాలయంలో సం ప్రదించాలని ఈవో తెలియజేశారు.

## విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన



**బనగానపల్లె, అక్టోబర్26, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం 5 నందు రవ్వలకొండ సమీపంలో గల ఏపీ మోడల్ బాలికల స్కూల్, మహాత్మ జ్యోతిబాపులే గురుకుల స్కూల్, బీసీ బాయ్స్ హాస్టల్ నందు విద్యార్థులకు టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్.శివశంకరుడు, ఎంపీహెచ్ఈవో నల్లగట్ల వెంకటేశ్వర్లు విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పై అగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివశంకరుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే తగిన మందులు వాడాలని తగ్గకపోతే మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేయాలని తెలిపారు. అలాగే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు మరియు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. అదే విధంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి, చలికాలంలో వచ్చే జబ్బులు గురించి, మలేరియా, డెంగ్యూ జ్వరాల గురించి వారు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలు రక్తహీనతకు గురికాకుండా వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఆరోగ్య కార్యకర్త గ్రేసమ్మ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఆశావర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సమాజ సేవాకర్త వంకదారు శ్రీనాథ్‌గప్తాకు డాక్టరేట్ ప్రదానం..

**- శ్రీనాథ్‌గుప్తాకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు హర్షం**

**- డాక్టరేట్ రావడంతో మరింత బాధ్యత పెరిగింది**

**- డాక్టరేట్ గ్రహీత వంకదారు శ్రీనాథ్‌గుప్తా**

**ఆదోనిలీగల్, అక్టోబర్26, ప్రభాతవార్త;** ఆదోని అవోపా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ(వామ్) అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు గౌరవ డాక్టరేట్ అవార్డుతో సత్కరించారు. ఈ మేరకు శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పట్టణంలో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వారిచే హోటల్ హిల్స్‌లో గౌరవ డాక్టరేట్ అవార్డు, సోషల్ సర్వీస్ క్యాటగిరిలో ప్రదానం చేశారు. ఈ అవార్డు మహోత్సవం మాస్టర్ విజయ్ ఫౌండర్, ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ, కె.మనోహరన్, మాజీ ఎమ్మెల్యే డా.శివమూర్తి, కిమ్స్ ఆస్పత్రి నాగఫణిసాయి, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ మొదలగువారి చేతులమీదుగా జరిగిందని యూనివర్సిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డాక్టరేట్ అవార్డు రావడం తనకెంతో ఆనందంగా ఉందని అవార్డు గ్రహీత వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మరింత బాధ్యత పెరిగిందన్నారు. చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో చేసిన మెడికల్ క్యాంపులతో అవోపా, వామ్ టీం సభ్యుల సహకారంతో ఈ డాక్టరేట్ తనకు లభ్యమయ్యిందని చెప్పారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తానని ఆయన తెలిపారు. శ్రీనాథ్‌గుప్తాకు డాక్టరేట్ రావడం పట్ల అవోపా, వామ్ సభ్యులు అభినందనలు తెలియజేశరు.



## మెమోల లిస్ట్ తయారు చేయాలి

**పత్తికొండ, అక్టోబరు 26, ప్రభాతవార్త**

విద్యార్థులు పట్టికలర్ మార్కులు పర్టిక్యులర్‌ను తయారు చేసి ఆర్డర్‌లో రిపోర్టు అందచేయాలని ఎంఈఓ-1,2లు తిమ్మారెడ్డి, రమేష్‌లు అన్నారు. ఏపిఏఏఆర్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రతిభ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల హెచ్ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుని, విద్యార్థులు ప్రతిస్కూల్‌లో పట్టికలరు మార్కుల మెమోలు లిస్ట్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ పరిధిలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్, ప్రైవేటు స్కూల్, ఎయిడెడ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

## జోరుగా టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు



**తుగ్గలి, అక్టోబరు 26, ప్రభాతవార్త**

టిడిపి పార్టీ హయాంలోనే అన్ని విధాల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, రైతుసంఘం నాయకుడు మనోహర్ చౌదరి, బొందిమడుగుల సర్పంచ్ గౌరవ సలహాదారుడు ప్రతాప్ యాదవ్‌లు అన్నారు. శనివారం మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యామ్‌కుమార్‌ల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల మండల నాయకులతో కలిసి టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు పార్టీపై అభిమానంతో స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రూ.100లు చెల్లించి పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని దానికి తమకెంతో ఆనందంగా ఉందన్నారు. దీంతో టిడిపి పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు. టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.2లక్షలుగా ఉన్న ఇన్సూరెన్స్‌ను రూ.5లక్షలకు పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. చనిపోయిన కార్యకర్తలకు తక్షణ సహాయం కింద మట్టి ఖర్చులకు రూ.10వేలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చి సభ్యత్వం తీసుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎద్దులదొడ్డి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మసాల శీను, రంగారెడ్డి, చాంద్ భాష, రాంపల్లి మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు, తెలుగు మహిళా మండలి అధ్యక్షురాలు ఈరమ్మ, మైరాముడు, నునసరాల డీలర్ రవి, రాంకొండ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌గౌడ్‌తో పాటు మరింతమంది తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**నందికొట్కూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్తానిక పటేల్ సెంటర్‌లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి మాట్లాడుతు ప్రభుత్వాలు మారుతున్నప్పటికి ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారంచడంలో విఫలం అవుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఆటో కార్మికులపై అధిక జరిమానాలు వవధించిన జీవో 21 మరియు 31 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారని అయితే ఏ సమస్యను పరిష్కారించలేదని ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పంధించి కార్మికుల సమస్యలు పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 2 పోర్టబుల్ అల్ట్రా సౌండ్ మిషన్‌లు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆమెరికాలోని చికాగోలో నివసించే 1962-63 బ్యాచ్‌కు చెందిన కర్నూలు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి అరుణ దంపతులు తమ మాతృమూర్తి పెన్నబడి గంగులమ్మ జ్ఞాపకార్థం రూ.30 లక్షల విలువచేసే వివిధ ఎక్విప్మెంట్స్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు విరాళంగా అందజేశారు. గైనిక్ మరియు ఎమర్జెన్సి మెడిసిన్ విభాగాలకు విలువైన వైద్యపరికరాలు పోర్టబుల్ రెండు అల్ట్రాసౌండ్ మిషన్‌లను శనివారం ప్రారంభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రి గైనిక్ విభాగంలో గర్భవతులకు, కాన్పుసమయంలో పేషెంట్ దగ్గరకు వెళ్లి స్కానింగ్‌చేయడానికి వీలు ఉంటుందని తెలిపారు. గుండెరేటు మార్పులు వచ్చినప్పుడు కారణాలు తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు. రెండవ అల్ట్రాసౌండ్ మిషన్ కా ్యజువాలిటి విభాగానికి వచ్చే ఎమర్జేన్సీ కేసులకు పేషెంట్‌ల వద్దకు వెళ్లి స్కానింగ్ చేయడానికి వీలు ఉంటుందని తెలిపారు. త్వరలో ఇన్ఫెర్టిలిటి విభాగం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. పేషెంట్స్ అటెండర్ బిల్డింగ్ కోసం మూడు కోట్ల రూపాయలు ఇవ్వడానికి ఇద్దరు పూర్వపు వైద్యులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి గైనిక్ విభాగపు హెచ్ఓడి డా.శ్రీలక్ష్మి, ఎమర్జేన్సీ డిపార్టుమెంట్ హెచ్‌డి డా.రామ్‌శివనాయక్, రెడియాలజి విభాగపు హెచ్ఓడి డా.రాధారాణి, డిప్యూటి సిఎస్ఆర్ఎంఒ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు**

**- ఎస్ఐ చంద్ర**

**హోలహర్వి, అక్టోబర్26, ప్రభాతవార్త;** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోలహర్వి ఎస్ఐ చంద్ర అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు గూళ్యం గ్రామానికి చెందిన నాగమణి కుటుంబ సభ్యులను విచారించారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వస్తే లిఫ్ట్ చేయ కూడదన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు అడిగితే ఇవ్వొద్దని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు ఇవ్వడం వల్ల సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు దోచుకుంటారన్నారు. మండలంలోని చాలామంది సైబర్ నేరాలకు గురయ్యారన్నారు. సైబర నేరాలపై కేసులు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలకు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణా తరగతులు



**నందికొట్కూరు, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** మండలంలోని రైతులకు మంచి సేవలు అంధించేందుకు డివిజన్ స్థాయిలో రైతు సేవా కేంద్రాల యొక్క సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్తానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన శిక్షణా తరగతులలో ప్రధాన శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డా.రామకృష్ణారావు, డి.ఆర్.సి. ఏవో హేమలత సిబ్బందికి పలుసలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సి.విజయశేఖర్, మండల వ్యవసాయశాఖ అధికారులు పి.షేక్‌షావలి, పీరునాయక్, వ్యవసాయ విస్తరణ అధికారిని, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎంపిఈఓలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలి

**- యూటీఎఫ్ నాయకుల డిమాండ్**

**ఆదోనిలీగల్, అక్టోబర్26, ప్రభాతవార్త;** అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించి ఉపాధ్యాయులందరికీ బదిలీలు చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ అధ్యక్షులు సునీల్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్ అన్నారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులపై వివక్షమాని వెంటనే ఖాళీగా ఉన్న అన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా అనేక సంవత్సరాలుగా అడుగుతున్న మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

**- ఆదోని పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక**

అంతకముందు ఆదోని పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా సునీల్‌రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావు, గౌరవాధ్యక్షులుగా ఓబేదూర్ రహమాన్, గౌరవ సలహాదారులుగా ఫయాజ్, గిరబాబు, కోశాధికారిగా మురారి, మహేష్, సహాధ్యక్షులుగా నాగేష్, శకుంతల, అదేవిధంగా జిల్లా కౌన్సిలర్లుగా మల్లికార్జున, రాహుల్, అమీన్, సీపీఎస్ కన్వీనర్‌గా సాదిక్, హుసేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా జిల్లా నుంచి జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప ఎన్నికలు నిర్వహించారు.

# సర్కార్ వారి పాట.. వాయిదా పడిన చేపల వేట..!

**- గందరగోళం మధ్య చేపల పెంపకం వేలం పాట వాయిదా..**
**- మూడో సారి వాయిదా పడితే వేలం పాట రద్దు?..**



**కోసిగి, అక్టోబరు 26, ప్రభాతవార్త**
కోసిగి గ్రామ పరిధిలోని పులికనుమ రిజర్వాయర్‌లో చేపలను పెంచి విక్రయించేందుకు మత్స్య శాఖ నిర్వహిస్తున్న వేలం పాట గందరగోళం మధ్య వాయిదా పడింది..సర్కార్ ధర అధికంగా ఉండడంతో వేలం పాటదారులు వేలం పాడేందుకు ముందుకు రాలేదు..అయితే ప్రభుత్వం నిర్ణయించిన వేలం పాట ధరను తగ్గించాలని డిమాండ్ చేసారు.. వేలం నిర్ణిత గడువును కేవలం 8 నెలలుమాత్రమే నిర్ణయించడంతో పాటదారులు సర్కార్ వారి పాటను తగ్గించాలని డిమాండ్ చేసారు.. దీంతో మత్స్య శాఖ డివిజన్ సహాయ పర్యవేక్షకులు నాగరాజు ఈ వేలం పాటను వాయిదా వేసారు..పులికనుమ చెరువులో ప్రభుత్వం మత్స్యశాఖ నేతృత్వంలో ప్రతి సంవత్సరం వేస్తున్న వేలం పాటను శనివారం స్థానిక మండలకార్యాలయంలో ఎంపీపీ లవకుశ ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు.. ముందుగా చేపల పెంపకం కోసం వేలం పాటదారులనుండి డిపాజిట్ కింద రూ.10వేలు నగదును కట్టించుకుని రశీదును పొందారు..ఈ రశీదు ఉన్నవారిని మాత్రమే పోలీసులుకార్యాలయం లోపలికి అనుమతించారు..చేపల పెంపకం కోసం వేలం పాటలో భాగంగా మత్స్యశాఖ అధికారి నాగరాజు వేలంనుకొనసాగించారు.. కాగా సర్కార్‌వారి పాటను రూ.74,879లు మొదలు పెట్టారు ఇందుకు సంబందించి చేపల పెంపకం కేవలం నవంబరు నుండి వచ్చే ఏడాది జూన్ నెల వరకు అంటే 8 నెలలు మాత్రమే ఉంటుందని చెప్పడంతో వేలం పాటదారులు ఇందుకుఅంగీకరించలేదు.. సర్కార్‌వారి వేలం పాట రేటును తగ్గించాలని లేదంటే కాల పరిమితిని పెంచాలని డిమాండ్ చేసారు..దీంతోఈ వేలం పాట కాస్తా గందరగోళంగా మారింది..వెంటనే ఎస్ఐ చంద్రమోహన్ జోక్యం చేసుకుని పాటదారులను సముదాయించారు..కనీసం 12 నెలలు పాటు ఈ వేలం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని జిల్లా అధికారులను అడిగాలని పట్టుపట్టారు....దీంతో పర్యవేక్షకులు నాగరాజు జిల్లా మత్స్యశాఖ అధికారిణి శ్యామల దృష్టిషికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.. కానీ జిల్లా స్థాయి అధికారులు ఇందుకు అంగీకరించకపోవడంతో వేలం పాటదారులు చేపల వేట వేలంను వాయిదా వేయాలని డిమాండ్ చేసారు..ఇక చేసేది లేక చేపల పెంపకం వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు నాగరాజు వెల్లడించారు..ఇక మూడోసారి జరిగే వేలం పాటజిల్లా అధికారిణితో నిర్వహిస్తున్నట్లు పర్యవేక్షకులు తెలిపారు.. అయితే ఈ వేలం పాట మూడోసారి వాయిదా పడితే రద్దు చేసేఅధికారం ఉంటుంది.. అంతేకాక ఈ కాల పరిమితిలో ప్రభుత్వం వారే స్వయంగా ఈ చెరువులో చేపలను పెంచి విక్రయించేఅవకాశం ఉంటుందని మత్స్యశాఖ అధికారులు తెలుపుతున్నారు..ఈ చేపల పెంపకం వేలం పాటకు సంబందించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు..

## హాని కలిగించే యురేనియం తవ్వకాలు నిలిపివేయాలి

**:- తహశీల్దార్‌కి ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ వినతి**



**దేవనకొండ,అక్టోబరు 26,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ నందు ప్రజలకు హాని కలిగించే యురేనియం తవ్వకాలను నిలిపివేయాలని ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, రామాంజి,భాస్కర్,మధులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ మండల ప్రతినిధి బృందం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ నందు యురేనియం తవ్వకాలకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నట్లు కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆరోపించారు. ప్రధానంగా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ నందు యురేనియం తవ్వకాలకు అనుమతి ఇస్తే ప్రజల ప్రాణాలకు హాని కలిగించే యురేనియం ధాతువు వలన తీవ్ర ప్రాణాపాయ ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అంతేకాక కప్పట్రాళ్ల,పి కోటకొండ,చెల్లెలచెలిమిల,జిల్లేడుబుడకల తదితర రెవెన్యూ గ్రామాల రైతులకు చెందిన దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం దెబ్బతినే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే యురేనియం ఉత్పత్తి కారణంగా ప్రవహించే వ్యర్థ పదార్థాలు సమీప కాలువల ద్వారా చెంతనే ఉన్న హంద్రీనీవా కాలువలో చేరి కలుషితమై కాలువల ద్వారా ప్రవహిస్తూ హంద్రీనది అలాగే తుంగభద్ర నది,కృష్ణా నదుల ద్వారా సముద్రంలో కలిసే అవకాశం ఉన్నందున తాగునీటికి,సాగునీటికి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు హాని కలిగించే ఏ చర్యకైనా విద్యార్థి,యువజన సంఘాలుగా వ్యతిరేకిస్తామన్నారు. యురేనియం తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండ నిలిపివేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి,యువజన సంఘాల నాయకులు నరేష్,సురేంద్ర,శ్రీరాములు, రవితేజ,భరత్ తదితరులు పాల్గొన్నారు.

## భారత యోగా సంఘం కార్యవర్గ సభ్యులుగా అవినాష్ శెట్టి



**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** ఈనెల 24న హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో జరిగిన యోగా ఫెడరేషన్ అఫ్ ఇండియా ఎన్నికల్లో కర్నూలు జిల్లా యోగా సంఘం యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎం అవినాష్ శెట్టి కార్యవర్గసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అడ్వకేట్ అమిత్ మెహతా ప్రకటించారని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. నూతన కార్యవర్గం 2025 నుంచి 2029 వరకు కొనసాగుతుందని లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు ఈసందర్భంగా అవినాష్‌శెట్టి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి వివిధ రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులు తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో యోగా అభివృద్ధికి నిరంతరం కృషిచేసి యువ క్రీడాకారుల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానన్నారు. అవినాష్‌శెట్టి ఎంపిక పట్ల రాష్ట్ర యోగా సంఘం అధ్యక్షులు చెరుకువాడ నరసింహారాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు సిహెచ్ ఆర్‌కే వర్మతో పాటు కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షకార్యదర్శులు కెఈ జగదీష్‌కుమార్, శ్రీనివాసులు, జిల్లా క్రీడా సంఘ ప్రతినిధులు విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, డా.రుద్రారెడ్డి, ఈశ్వర్‌నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు, యోగా గురువులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామాభివృద్ధ్యే తమ లక్ష్యం


**- సర్పంచ్ చలువాది రంగమ్మ**



**హోళగుంద, అక్టోబర్26, ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధ్యే తమ లక్ష్యమని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చలువాది రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్‌లు అన్నారు. మండల కేంద్రమైన హోళగుందలోని స్థానిక బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో లీకేజి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి చెత్త, పొడి చెత్తలను పంచాయతీ ట్రాక్టర్, ఆటోల్లో వేయాలని వారు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, టైఫాయిడ్ తదితర విషజ్వరాలు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు పంపాపతి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేలో జరిగిన అవకతవకలను సరి చేయండి

**- సాగుచేస్తున్న రైతులకు పట్టాపాసు పుస్తకాలు ఇవ్వాలి**
**- రైతుసంఘం నాయకుల డిమాండ్**



**కౌతాళంరూరల్, అక్టోబర్26, ప్రభాతవార్త;** రీ సర్వేలో జరిగిన అవకతవకలను సరి చేయాలని, సాగు చేస్తున్న రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, నారాయణ, యల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సులేకేరిలో జరిగిన గ్రామసభలో వారు అధికారులతో మాట్లాడారు. మండలంలో 13 గ్రామాల్లో రీ సర్వే జరిగిందన్నారు. చాలా గ్రామాల్లో భూములకు సంబంధించి కొలతల్లో తేడాలు, అడంగల్‌లో పేర్లు లేకపోవడం, ఒకరి భూమి ఇంకొకరికి నమోదు కావడం వల్ల గొడవలు కూడా జరిగాయన్నారు. అవకతవకలు సరి చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. సులేకేరిలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మూకమ్మ, మాంతయ్య, ఆదివాసు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త సభ్యత్వం నమోదు చేయించుకోవాలి




**హోళగుంద, అక్టోబర్26, ప్రభాతవార్త:** ఆలూరు నియోజకవర్గంలోని హోళగుంద మండల పరిధిలోని హెబ్బటం యూనిట్ ఇన్‌చార్జ్ నరసప్ప, బూత్ ఇన్‌చార్జ్‌లు మల్లికార్జున, గోపాల్, షేక్షావలి, ఆలూరు నియోజకరవ్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీలో ప్రతిఒక్క కార్యకర్త సభ్యత్వం నమోదు చేయించుకోవాలని వారు కోరారు. టీడీపీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఇన్సురెన్స్ కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. కావునా ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

## బెలుం గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ అనుమానస్పద స్థితిలో మృతి



**కొలిమిగుండ్ల, అక్టోబర్26, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని బెలుం గ్రామానికి చెందిన ఆర్ఎంపి డాక్టర్ కొండయ్య(40) అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. కొండయ్యని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే బెలుం గ్రామంలో ఆర్ఎంపి వైద్యుడిగా పనిచేస్తున్న కొండయ్య శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే శనివారం జీఎన్ఎస్ఎస్ కాలువలో కొండయ్య శవమై కనిపించాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని సీఐ తెలియజేశారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన



**వెల్దుర్తి, అక్టోబర్26, ప్రభాతవార్త**
వెల్దుర్తి మండలంలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి సమాచారహక్కు చట్టం2005పై స్థానిక రైతు సేవాకేంద్రం కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయాధికారి (ఏఓ) అక్బర్‌బాష అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ అక్బర్‌బాష చట్టం యొక్క విధి విధానాలు, కాలపరిమితి గురించి క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఇఓ విలసిత, రైతుసేవాకేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెవుడు, వినికిడి లోపం సమస్యలు గల వారికి స్క్రీనింగ్ క్యాంపు

**కర్నూలు విద్య, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** వినికిడి సమస్యలతో బాధపడుచున్న వారికి ఈనెల 28న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఓపినం.43లో డిఐఈసి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.భాస్కర్ తెలిపారు. చెవుడు నివారణ నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమంలో భాగంగా నేడు చెవుడు, వినికిడి లోపం సమస్య కలిగిన వారికి స్క్రీనింగ్ క్యాంపు దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ ద్వారా ఉచిత ప్రోగ్రామ్‌బుల్ హియరింగ్ హేడ్స్ పంపిణి కొరకు ఉచిత క్యాంపు నిర్వహించబడుతుందని తెలిపారు. సోమవారం ప్రభుత్వం తరుపున నిర్వహించే ఈక్యాంపుకు వినికిడి లోపం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, గతంలో వినికిడి పరీక్ష చేయించుకున్నవారు అడియోగ్రాఫ్ రిపోర్టు తప్పక తీసుకురావాల్సిందిగా కోరారు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గ్రామ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేయుచున్న వైద్యాధికారులు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మీ పరిధిలో ఏవరైనా ఈసమస్యలతో బాధపడుతుంటే వారికి ఈ క్యాంపుకు పంపాల్సిందిగా అదేశించారు. వివరాలకు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం మేనేజర్ ఇర్ఫాన్ ఫోన్ నం. 08518-251043ని సంప్రదించాలన్నారు.

## పేదల జీవితాలలో వెలుగు నింపుతున్న డాక్టరు రామిరెడ్డి



**కోవెలకుంట్ల, అక్టోబరు 26,ప్రభాతవార్త**
కోవెలకుంట్ల మేజరు పంచాయితీ పరిదిలో ఎంతో మంది పేద యువలు జీవితాలలో వెలుగు ప్రసాదిస్తున్న డాక్టరు రామిరెడ్డి అబినందనీయులని ఉపసర్పంచు జిసిఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని 50సంవత్సరాల నుండి వైద్యసేవలు అందిస్తున్న ఎంతో మందికి సేవలు అందిస్తు మొదట్లో రూ 2కే వైద్యము అందిస్తు పేద యువతుల వివాహాల శుభకార్యాలయాలకు మేన మామ రూపములో చీరక సారె కోసం రూ 5000 ఆర్థిక సహాయం చేస్తు పేదింటి దేవుడుగా కొనియాడబడుతున్న డాక్టరు రామిరెడ్డి 50సంవత్సరాల స్వర్ణోత్సవ కార్యక్రమము శనివారము నిర్వహించారు. ఈసందర్భముగా పలువురు డాక్టరును అబినందించారు.ఉపసర్పంచు సూర్యనారాయణరెడ్డి డాక్టరును కలిసి పూలమాల వేసి సన్మానించారు. ఈసందర్భము అయనకు అబినందనలు తెలిపారు. అలాగే పట్టణంలోని ప్రముఖులు అయనను అబినందించారు.

## నాయకులు,కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ




**ఆదోని,అక్టోబరు 26,ప్రభాతవార్త :**
తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న నాయకులు,కార్యకర్తలందరికి తెదేపా పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని ఎల్ఎల్‌సి మాజీ చైర్మన్ రామస్వామి,తెదేపా రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి,జంగం శివయ్యలు అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇంచార్జ మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు తెదేపా 2024-26 సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికి పార్టీ అన్నివిధాల అండగా నిలుస్తుందని అలాగే ఏదైన ప్రమాదవశాత్తు కార్యకర్తలు మరణిస్తే ప్రమాదభీమా రూ.5లక్షలు,సహజమరణం చెందితే మట్టి ఖర్చులకు రూ.10వేలు పార్టీ ద్వారా అందించడం జరుగుతుందని అలాగే ఎవరైనా నిరుపేద కుటుంబంలో మెరుగైన వైద్యం కోసం ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్య,ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కొరకు పార్టీ సభ్యత్వం సహాయ పడుతుందని కావున నియోజకవర్గంలోని నాయకులు,కార్యకర్తలు అన్ని గ్రామాల,వార్డులలో సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి

**దేవనకొండ,అక్టోబరు 26,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన జగన్నాథం(68)అనే వ్యక్తి అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు,మాజీ ఎంపిపి రామచంద్రనాయుడు,సర్పంచ్ అరుణ్‌కుమార్,మాజీ సర్పంచ్ రాజన్న,టిడిపి నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున,ఎంపిపి భర్త లుముంబ,సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తెర్నేకల్ గ్రామ అభివృద్ధి కోసం జగన్నాథం తనవంతుగా సహాయ,సహకారాలు అందించారన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**- ప్రధానోపాధ్యాయులు నజీర్ అహమ్మద్**



**హోళగుంద, అక్టోబర్26, ప్రభాతవార్త:** ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నజీర్ అహమ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలు కబడ్డీ క్రీడలో జిల్లాస్థాయి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నంద్యాలలో ఈనెల 24వ తేదిన జరిగిన జిల్లా క్రీడల్లో జిల్లాస్థాయి రాష్ట్రస్థాయికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హోళగుంద బాలికల కబడ్డీ క్రీడ నుండి అండర్-17లో కె.ఇందు పదవ తరగతి విద్యాభ్యాసం చేస్తుందన్నారు. అలాగే అండర్-14 విభాగం నుండి సి.భూమిక ఎనిమిదవ తరగతి చదువుతుందన్నారు. ఈ ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికవ్వడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈనెల 27,28,29 తేదిల్లో రాయచోటి, అన్నమయ్య జిల్లాల్లో జరిగే క్రీడల నందు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇలాంటి విద్యార్థులకు తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మాబాషా తదితరులు పాల్గొన్నారు.


## యువ కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు..

**- నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు**



**కౌతాళంరూరల్, అక్టోబర్26, ప్రభాతవార్త;** టీడీపీ పార్టీ యువ కార్యకర్త రాగప్ప మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ మంత్రాలయం సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య కుమారులు సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు వాపోయారు. గత కొద్ది రోజులుగా అనారోగ్య కారణాలతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్సల పొందుతూ శుక్రవారం రాగప్ప మృతిచెందాడు. శనివారం మృతదేహాన్ని స్వగ్రామమైన బంటకుంటకు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు మాట్లాడుతూ రాగప్ప కుటుంబానికి టీడీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ధైర్యంగా ఉండాలన్నారు. నివాళులు అర్పించిన వారిలో గ్రామ సీనియర్ నాయకులు నాగేంద్రరెడ్డి, నీలకంఠరెడ్డి, చంద్ర, ఉమాపతి, రామాంజనేయులు, గొట్టయ్య తదితరులు ఉన్నారు.

## ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి



**ఆదోని,అక్టోబరు 26,ప్రభాతవార్త**
రీసర్వేలో సొంత భూములను రైల్వే భూములుగా చూపించి వారి పేర్లను ఆన్‌లైన్ నుండి తొలగించారని వారి పేర్లను ఆన్‌లైన్‌లో చేర్చి వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని రైతుసంఘం మండల అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో భాగంగా మండల పరిధిలోని కుప్పగల్ గ్రామానికి వచ్చిన రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్యకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ మాకు 30రోజుల వ్యవధి కావాలని ఆలోగ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 30రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సుభాన్,బోజప్ప తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో విద్యార్థులు పతకాలు సాధించడం హర్షణీయం



**ఆదోని,అక్టోబరు 26,ప్రభాతవార్త :** తమ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమని విశ్వనారాయణ జూనియర్ మరియు ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున అన్నారు. శనివారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనారాయణ జూనియర్ మరియు ఒకేషనల్ కళాశాల మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థి మల్లికార్జున గుంటూరులో జరిగిన 5కి.మీల పరుగు పందెంలో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాడన్నారు. అలాగే నర్సింగ్ విద్యార్థిని శృతి అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి పతకం సాధించిందన్నారు. ప్రతి విద్యార్థి ఆటల్లో నైపుణ్యం కలిగి సాధన చేసి పతకాలు సాధించాలని మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మాపురంలో పారిశుద్ధ్య పనులు



**నందవరం, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** మండలంలోని ధర్మాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులు పంచాయితీ కార్యదర్శి సుజాత నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శి దగ్గరుండి గ్రామంలోని వీధి వీధి గుండా మురుగునీటి కాలువలను మరియు ప్రధాన వీధులను పారిశుద్ధ్య కార్మికుల వెంట ఉండి పనులు చేయించారు. కాల్వల్లో మరియు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడరును చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా ఆరికడుతున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన తడి చెత్త, పొడి చెత్త డస్ట్‌బిన్‌లను వాడి పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరు తమ వంతు కృషిచేయాలని తెలిపారు.

## పంటల భీమా కొరకు ప్రీమియం కట్టుకోవాలి



**దేవనకొండ,అక్టోబరు 26,ప్రభాతవార్త**
రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్న రైతులందరు పంటల భీమా కొరకు ప్రీమియం కట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. శనివరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద సెనగ,వేరుశనగ, టమోటా, మిరప,వరి,మొక్కజొన్న తదితర పంటలు భీమా కింద నోటిఫై అయి ఉన్నాయన్నారు. ఎవరైనా రబీలో లోన్ తీసుకుంటారో వారికి సంబంధిత బ్యాంకు వారే ప్రీమియంను కట్టుకోవాలన్నారు. లోన్ తీసుకునే రైతులు సెనగకు ఎకరానికి రూ.230,వేరుశనగకు ఎకరానికి రూ.290,మిరపకు రూ.525లు,టమోటాకు రూ.720లు,మొక్కజొన్నకు రూ.297లు తెలిపిన ప్రీమియం అమౌంట్ ఒక ఎకరానికి సంబంధించినది డిసెంబరు 15వ తేదీలోపు సంబంధిత ఆర్ఎస్‌కెలో కానీ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో కానీ డిడి రూపంలో చెల్లించాలన్నారు. ఈ సదుపాయాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మైపర్‌లో మెడికల్ కోడింగ్‌పై అవగాహన సదస్సు



**కర్నూలు విద్య, అక్టోబర్ 26, ప్రభాతవార్తః** కర్నూలు నగరలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాల యందు శనివారం విద్యార్థులకు మెడికల్ కోడింగ్ యొక్క ప్రాధాన్యత మరియు ఉద్యోగ అవకాశాల గురించి ఎక్లాట్ మెడికల్ కోడింగ్ మరియు మైపర్ అల్యూమినియం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మెడికల్ కోడింగ్‌లో ఫార్మసీ విద్యార్థులకు చాల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అలాగే వారికి ఫార్మసి యందు ప్రావీణ్యమున్నచో ఈరంగంలో రాణించవచ్చున్నారు. అలాగే వారి యొక్క వర్కు, వారికి వచ్చు జీతభత్యాల గురించి ఎటువంటి ప్రమోషన్స్ ఉంటాయి, ఎటువంటి జాబ్స్ సెక్యూరిటి ఉంటుందన్న విషయం మీద మిస్టర్ ఎం థామస్కేరి, ఎం బాలు, ఎం తిరుమలేష్, జి రోషినిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాన్ని ముందుగా కళాశాల డైరెక్టరు ఆదిమూలపు సతీష్ ప్రారంభించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డా.రాజ్‌కుమార్, ఎన్ఏసిసి కో-ఆర్డినేటర్ రఘువీర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్మరిచేడు స్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి కాంపౌండ్‌వాల్ నిర్మించాలి

**- కమ్మరిచేడు గ్రామాభివృద్ధికి సహకరించండి - ఎంపిపి జెట్టప్పగారి రంగమ్మ**



**ఆలూరు రూరల్, అక్టోబర్26, ప్రభాతవార్త:** ఆలూరు మండలం కమ్మరిచేడు గ్రామంలో జరిగిన గ్రామసభలో భూ రీ సర్వేలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఎంపిపి జెట్టప్పగారి రంగమ్మ తహసీల్దార్ గోవింద్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. అలాగే గ్రామంలో స్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి కాంపౌండ్‌వాల్‌ను నిర్మించాలని ఎంపిపి కోరారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ప్రతి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రోటోకాల్ పాటించి తమకు సహకరించాలని ఎంపిపి తనయుడు జెట్టప్పగారి వీరేష్ తెలిపారు.

# రైతులకు సంపాదన.. పశుగణన

- 21వ అఖిల భారత పశుగణన ప్రారంభం..
- డిజిటల్ పద్ధతిలో వివరాలు సేకరణ..
- పశువుకు ట్యాగ్..గుర్తింపు స్టిక్కర్..
- 16 జాతులపై నాలుగు నెలల పాటు సర్వే..
- ఐదేళ్లకొకసారి లెక్కింపు..తేలనున్న గొర్రెల లెక్కలు..

**కోసిగి, అక్టోబరు 26, ప్రభాతవార్త**

మానవ జీవన శైలిలో శాస్త్ర సాంకేతికంగా ఎంతో ప్రగతిని సాధించినప్పటికీ చాలా వరకు రైతులు వ్యవసాయ అనుబంధరంగమైన పాడి పశువులు ఆధారంగానే జీవనోపాధి పొందుతున్నారు.. అంతటి ప్రాముఖ్యత కలిగిన పశువుల గణన చేపట్టేందుకు పశు సంవర్ధక శాఖ సిద్ధం చేసింది..పశువుల లెక్క ఇకపై పక్కాగా ఉండనుంది.. పశుసంవర్ధక శాఖ జాతీయ పశుగణన చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది..ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిలో ఎన్ని పశువులు ఉన్నాయో లెక్కించేందుకు పశుగణన ప్రారంభం అయింది.. దీంతో ఈ నెల 25 నుండి ఫిబ్రవరి 2025 వరకు నాలుగు నెలల పాటు 21వ అఖిల భారత పశుగణనను చేపట్టారు.. ఈసర్వే నేపథ్యంలో 16 జాతులకు సంబందించచిన వివరాలను డిజిటల్ సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు..

**పశుగణన ప్రాముఖ్యత:**

పశు సంపద దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం..పశు గణన ద్వారా ఈ సంపదను కచ్చితంగా అంచనా వేయవచ్చనేసదుద్దేశ్యంతో భారత ప్రభుత్వం ఈ పశు గణన సర్వేను చేపట్టింది.. దీని ద్వారా రైతుకు వ్యవసాయంతో పాటు పాడిఎంత ఉందోననే విషయాన్ని తెలుసుకోవచ్చు..

**వివిధ రకాల రూపకల్పన:**

పశు సంపద అభివృద్ధికి సంబందించిన విధి విధానాలను రూపొందించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది..

**ఆరోగ్య నిర్వహణ:**

పశువుల ఆరోగ్యాన్ని పశు గణన ద్వారా సమగ్రంగా అంచనా వేయవచ్చు.. దీని ద్వారా పశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వంవ్యాధి నియంత్రణ కార్యక్రమం, టీకాల పంపిణీ కార్యక్రమం సమర్థవంతంగా చేపట్టవచ్చు..

**పాడి పరిశ్రమకు అవసరమైన మౌలిక వసతులు:**

పశు గణన ద్వారా పాడి పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఎక్కడ అవసరమో గుర్తించి వాటిని సమర్థవంతంగా ఏర్పాటు చేయవచ్చు..

**జాతుల సంరక్షణ:**

అంతరించి పోతున్న జాతుల గుర్తింపు మరియు సంరక్షణకు ఈ గణన దోహదపడుతుంది...ప్రభుత్వ పథకాల అమలు పశుగణన సర్వేలో సేకరించిన వివరాలు ఆధారంగా రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, సబ్సిడీలు వంటి వాటినిసమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుంటుంది.. 2019 తరువాత జరుగుతున్న పశు గణనలో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, గేదే జాతి పశువులు, కోళ్లు, గొర్రెలు,మేకలు, కుక్కలు, పందులు, పెంపుడు కుక్కలు, డైయిరీ ఫారాలు, కోళ్ల ఫాంలను లెక్కించనున్నారు..

**పథకాల రూపకల్పనకు అవకాశం:**

ఈ పశుగణన ద్వారా గతంతో పోల్చితే పశువుల(జీవజాతు) సంఖ్య ఏ మేరకు పెరిగిందనేది తెలిసి పోతుంది..తద్వారా అవసరాల మేరకు పశు వైద్యశాలలు, పశువైద్యులు, సిబ్బంది, మందులు ఉన్నాయా.. పశుజాతుల సంఖ్య వంటి అంశాలను ప్రభుత్వాలు అంచనా వేసుకునేందుకు దోహదపడనుంది.. ఈ సర్వే గణాంకాల వివరాల కను గుణంగా పాడిపరిశ్రమ తీరు, వాటి అభివృద్ధి, పశుగణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన,అమలు, వంటి అంశాలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది..

## సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోండి : సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి



**నందికొట్కూరుటౌన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :**

పట్టణంలో వివిధ వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులు తమ దుకాణాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నందికొట్కూరు అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పట్టణంలోని వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి చర్చించారు. పట్టణంలోని ప్రతి వ్యాపార దుకాణంలో రెండు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఒక సీసీ కెమెరా దుకాణంలోని ప్రాంతాన్ని, మరో సీసీ కెమెరా దుకాణం బయట ప్రాంతాన్ని కవర్ చేసేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్న వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు అర్థిక ఇబ్బందులు ఉంటే ఇద్దరు, ముగ్గురు చిరు వ్యాపారులు కలిసి రెండు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద వ్యాపారులు మాత్రం తాము సూచించిన విధంగా కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో ఏ మూలన ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాలు ఉంటే దుండగులు తప్పించుకోలేరన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు మీ కోసమే, మీ సంక్షేమం కోసమే అనే విషయాన్ని వ్యాపారులు మరువరాదన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులకు 15 రోజుల సమయం నిర్ధేశించామన్నారు. ఇచ్చిన సమయంలోగా ప్రతి వ్యాపార దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమయం ముగిసినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకపోతే మొదటిసారి తనిఖీకి వచ్చినపుడు రూ.5వేలు, రెండవసారి తనిఖీకి వస్తే రూ.10వేల జరిమానా విధిస్తామన్నారు. అప్పటికీ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకపోతే తదుపరి చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమేగాకుండా వాటిని ఎప్పటికపుడు మానిటరింగ్ చేసుకోవాలని, మంచి మెగాపిక్చల్స్ కెమెరా, బ్యాక్‌అప్ బాగా వచ్చేలా మెమొరీ రేంజ్ హైలో ఉండేలా చూసుకోవాలని, రాత్రి సమయంలో కూడా పనిచేసే కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 24 గంటలు సీసీ కెమెరాలు పని చేసేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, పట్టణంలోని వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి-డియస్పి



**కోవెలకుంట్ల, అక్టోబరు 26,ప్రభాతవార్త**

విద్యార్థులె తమ విద్యార్థి దశలోనే చట్టాలపై ,పోలీసులు విదులు బాద్యతల గురించి తెలుసుకోవాలని డియస్పి రవికుమారు చెప్పారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వం జూనియర్ కాలేజిలో సిఐ హనుమంత్‌నాయక్, యస్ఐ మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు అవగాహణ కార్యర్కమం నిర్వహించారు. ఇందులో అళ్లగడ్డ డియస్‌పి రవికుమారు పాల్గొన్నారు. ఈసందర్బముగా అయన విద్యార్థినీ విదా ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో క్రమిశిక్షణతో పట్టుదళతో విద్యాను కొనసాగించాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థి దశలో పోలీసులు, వారి విదులు బాద్యతలు ఖచ్చితంగా తెలుసుకోవాలని చెప్పారు. వీటి వల్ల మీకు ఎంతో ఉపయోగము ఉందని చెప్పారు. ముఖ్యంగా సెక్షన్‌లు వాటి వల్ల పడే శిక్షలు, ఏ నేరము ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు ఎలాంటి శిక్షలు పడుతాయి.అనేది మీరు తెలుసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థి దవలో ర్యాగింగ్ చేస్తే ఏమిటిఐ ఏ శిక్ష పడుతుంది పోలీసు నమోదు చేసే సెక్షన్ ఏమిటి అసెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేస్తే ఇక విద్యార్థి లైఫ్ స్పాయల్ అని డియస్‌పి అ సెక్షన్ గురించి వారిక వివరించారు. ఈకార్యక్రమంలో కాలేజి ప్రిన్సుపాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన జనార్ధనరెడ్డి



**నంద్యాల, అక్టోబరు 26,ప్రభాతవార్తప్రతినిధి**

నంద్యాలజిల్లా విద్యావాఖాదికారిగా నియమించిన జనార్ధనరెడ్డి శనివారము బాద్యతలు చేపట్టారు. ఈయనకు నంద్యాల పట్టణంలో ఉన్న ప్రవేటు పాఠశాల కరప్పాడెంట్‌లు మర్యాద పూర్వకముగా కలిసి శుబాకాంక్షలు తెలిపారు. ఈసందర్బముగా ప్రవేటు పాఠశాలల అసోషియేషన్ అద్యక్షులు దండె దస్తగిరి మాట్లాడుతూ నూతనంగా పవది బాద్యతులు చేపట్టిన జిల్లావిద్యాశాఖాదికారి అబినందనలు తెలిపినట్లు చెప్పారు. రెవన్యువల్స్ అప్ రికగ్నైజేషన్ విషయంలో అపార్ ఐడిజనరేషన్ విషయంలో ఉన్న సమస్యలను తొలగించాలని విన్నవించామన్నారు. ఈకార్యక్రమంలో రవికిండర్ గార్డెన్ కరస్పాడెంట్ పదకల సుబ్రమణ్య,రవీంద్రబాలకాలనీ విద్యాసంస్థల కరస్పాడెంట్ రవీంద్రనాథ్,నారాయణ స్కూల్స్ పాండె,గుడ్‌రే స్కూలు రసూల్ అజాద్, సెయింట్‌జోసెఫ్ స్కూలు విజయ్‌కుమారు న్యామతుల్లా తదితర కర్సగ్పడెంట్లు పాల్గొని డిఈఓ జనార్ధనరెడ్డి ఘనంగాసత్కరించారు.

## తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం..!

**- ఆలూరు టిడిపి నాయకులు**

**ఆలూరు,అక్టోబరు 26,ప్రభాతవార్త**

ఆలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆలూరు టిడిపి నాయకులు,మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్,మండల కన్వినర్ అశోక్ యాదవ్,ఆస్పరి తెలుగు యువత అధ్యక్షులు రాఘవేంద్ర యాదవ్,ఉపేంద్ర,చంద్రలు అన్నారు. శనివారం రాష్ట్ర రాజధాని అమరావతిలో టిడిపి కార్యాలయంలో వారు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని సభ్యత్వ నమోదుపై దృష్టి సారిస్తామని అన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉండే పలు సమస్యలపై రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌తో చర్చించినట్లు తెలిపారు. ఆలూరు నియోజకవర్గం వెనుకడిన నియోజకవర్గం అని నిధులు అధికంగా ఇచ్చి ఆదుకోవాలని,మండలంలో బిసి కమ్యూనిటీ హాలు నిర్మించాలని వారు కోరారు.



## కార్యకర్తల సంక్షేమమే తెదేపా ధ్యేయం : మాండ్ర

**: తెదేపా సభ్యత్వంతో రూ.5లక్షల బీమా సౌకర్యం : ఎమ్మెల్యే గిత్తా జయసూర్య**



**నందికొట్కూరుటౌన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :**

కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని, కేవలం నూరు రూపాయల నామమాత్రపు మొత్తంతో సభ్యత్వం పొందే పార్టీ కార్యకర్తలకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మాండ్ర, గిత్తా జయసూర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ఎంతో నిస్వార్థంగా, అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉండాలనే ఉద్ధేశంతో తెదేపా అధినేత పార్టీ బలోపేతంలో కార్యకర్తలను భాగస్వాములను చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టారన్నారు. ఈ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు రూ.5లక్షల బీమా సౌకర్యంతో పాటు వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం కూడా చేయనున్నారన్నారు. ఎంతో క్రమశిక్షణ, విధేయత, పట్టుదల గల కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని, అలాంటి వారికి అండగా నిలవాలనే సదుద్ధేశంతో రాష్ట్ర పార్టీ తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో చేపట్టాలని అదేశించిందన్నారు. ఈ మేరకు నందికొట్కూరు నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమక్షంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయించే ప్రణాళిక రూపొందించామన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన పథకాలన్నీ ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని, దీపావళి పండుగ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయనున్నారన్నారు. ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సరైన నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నారని, రెండేళ్లలో పోలవరం పూర్తి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను గాలికి వదిలేసిన విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందేనన్నారు. తెదేపా హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే రహదారులను దాదాపుగా చక్కదిద్దారని వారు గుర్తు చేశారు. పార్టీ సభ్యత్వాల నమోదు విషయంలో పార్టీ నాయకులు కలిసికట్టుగా కృషి చేసి నందికొట్కూరు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాండ్ర శివానందరెడ్డి సతీమణి మాండ్ర ఉమాదేవి, తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, సహదేవుడు, నారపురెడ్డి, వేణు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

**- సబ్ కలెక్టర్**



**నందవరం, అక్టోబర్ 26, ప్రభాతవార్తః**

రీ సర్వే జరిగిన గ్రామాల్లో నెలకొన్న రెవిన్యూ సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు అధోని సబ్ కలెక్టరు మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మాపురంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఆ గ్రామంలో ఒకే ఒక సమస్య ఆయన దృష్టికి ఆ సమస్య ఉన్న ఇరువురు రైతులను కూర్చొబెట్టి సమస్యను పరిష్కరించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని ఆయన ప్రజలకు తెలిపారు. గ్రామ సభల్లో వచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు అదేశాలు జారీచేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూట ఇన్‌సె ్పక్టర్ ఆఫ్ శ్రీనివాసరాజు, ఉప తహశీల్దార్ మహేష్, ఆర్ఐ జర్మియా, జిల్లా సర్వేయర్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ వహాబ్, గ్రామ సర్వేయర్ల శేఖర్, చంద్రశేఖర్, విఆర్వో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీవాగులో గల్లంతైన బాలుడు మృతి

**దేవనకొండ,అక్టోబరు 26,ప్రభాతవార్త**



మండల పరిధిలోని అలారుదిన్నె గ్రామానికి చెందిన ఆవుల నరసన్న,సోమేశ్వరిల కుమారుడు మహేష్ అనే ఆరేళ్ల బాలుడు హంద్రీవాగులో గల్లంతై శనివారం శవమై కనిపించాడు. వివరాల మేరకు ఇలా వున్నాయి. తల్లిదండ్రులు హంద్రీవాగు పక్కలో ఉన్న పొలాలలో పనులు చేసుకుంటుండగా బాలుడు ఆడుకుంటూ హంద్రీవాగులో కొట్టుకుపోయాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి బాలుడు కనిపించకపోవడంతో హంద్రీవాగు అంత వెతికినా కూడా కనిపించలేదు. శనివారం ఉదయం గ్రామస్తులందరు వెతకగా హంద్రీవాగులో బాలుడు మృతదేహాన్ని గుర్తించారు. ఆ కుటుంబానికి ఉన్న ఏకైక కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## పన్ను వసూళ్ళ లక్ష్యాలను సాధించాలి

**కర్నూలు మున్సిపల్, అక్టోబర్ 26, ప్రభాతవార్తః**

నగరపాలకకు రావాల్సిన అస్తి, నీటి పన్ను వసూళ్ళల్లో లక్ష్యాలను సాధించాలని నగర పాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు అదేశించారు. శనివారం స్థానిక ఎస్బీఐ కాలనీలోని కౌన్సిల్ హాల్‌లో రెవిన్యూ విభాగంపై సమీక్ష నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఆర్వోలు జునైద్ ఇశ్రాయేల్, ఆర్ఐలు, సచివాలయ అడ్మిన్‌లు, ఎమ్యూనిటిస్ కార్యదర్శులు హాజరయ్యారు. ప్రతి సచివాలయ పరిధిలో ప్రణాళికలు రూపొందించుకొని పన్ను వసూలు వేగవంతం చేయాలని జాప్యం తగదన్నారు.



## ప్రతిఒక్కరు తప్పనిసరిగా టిడిపి సభ్యత్వ నమోదు చేసుకోవాలి..

**- ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్**



**ఆలూరు,అక్టోబరు 26,ప్రభాతవార్త**

ప్రతిఒక్కరు తప్పనిసరిగా టిడిపి సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా టిడిపి ఇంచార్జ వీరభద్రగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మండల కన్వినర్ల సమక్షంలో ప్రతిఒక్కరు టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు తప్పక తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి పేదప్రజలకి ఈ యొక్క సభ్యత్వం ఉపయోగం గురించి తెలుసుకుని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. గతంలో టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి రూ.2లక్షల ప్రమాద భీమా అందించిందని ఇప్పుడు టిడిపి సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదం జరిగితే రూ.5లక్షల వరకు ప్రమాద భీమా అందిస్తుందన్నారు. టిడిపి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా ఉండాలని సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించామన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26వ తేదీ నుండి వారం రోజుల పాటు ఆయా మండలాల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హాలహర్వి,దేవనకొండ,ఆస్పరి మండలాల కన్వినర్లు సుధాకర్,విజయ్,పరమారెడ్డి,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి,ఎంపిటిసి రజిని,మాజీ సర్పంచ్ నరసప్ప,తిమ్మప్ప,మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక

**- జిల్లాతెదేపా నాయకులు సుబ్బరాయుడు**

**- వెల్దుర్తి మండలంలో మొదలైన తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం..**



**వెల్దుర్తి, అక్టోబర్26,ప్రభాతవార్త**



కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక అని జిల్లా తెదేపా నాయకులు యం.సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో ఆయన తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు,కార్యకర్తలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు సారథ్యంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చామన్నారు.సభ్యత్వంకు 100 రుపాయలు చెల్లించాలన్నారు.దీంతో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదభీమా రూ.5లక్షల రుపాయలు ఉంటుందన్నారు.పార్టీ నాయకులు,కార్యకర్తలను దృష్టిలో ఇతర ప్రయోజనాలు సైతం చంద్రబాబునాయుడు అందించనున్నారన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.అదేవిధంగా గుంటుపల్లి గ్రామంలో నాయకులు ఈదుల వెంకటరాముడు స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్ష్మీరెడ్డి,యం.రామాంజనేయులు,సూదేపల్లి రామచంద్రుడు, భాస్కర్, శేషన్న,భాస్కర్,రంగడు,రాజు,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే టీడీపీ పార్టీ ధ్యేయం...

- టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన
- ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది
- టీడీపీ మంత్రాలయం సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య



**కౌతాళంరూరల్, అక్టోబర్26, ప్రభాతవార్త;**

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మంత్రాలయం సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరులు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చేపట్టిన టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వనమోదు కార్యక్రమంలో విరివిగా ప్రజలు, అభిమానులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని మేలు చేకూరేవిధంగా సభ్యత్వం తీసుకునన ప్రతి కార్యకర్తకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు బీమా, అకాల మరణణ చెందితే రూ.10 వేలు మట్టి ఖర్చులకు వారి కుటుంబానికి అందించడం జరుగుతుందన్ననరు. అలాగే ఉపాధి అవకాశాలు, కుటుంబానికి విద్య, వైద్య సహాయ సహకారాలు అందజేసేలా పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. బందువులు, స్నేహితులు, మన చుట్టూ ఉన్న వారు సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కార్యకర్త ఒక సవాలుగా స్వీకరించి జిల్లాలోనే అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోటీడీపీ సీనియర్ నాయకులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, సౌద్రిబసవరాజు, గురురాజస్వామి, టిప్పుసుల్తాన్, రామలింగన్న, కురువ వీరేష్, పట్టాభి, డా.రాజానంద, యువ నాయకులు సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు, చంద్రన్న, తిక్కయ్య, రంగస్వామి, శంకర్, నరసన్న, బసవరాజు, దొడ్డన్నగౌడ్, నరసింహులు, బాషా, డేవిడ్, వీరేష్, నరసింహులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి టిడిపి కార్యకర్తకు రూ.5లక్షల భీమా

**- కార్యకర్తల కృషి వల్లే టిడిపికి అధికారం**

**- అట్టహాసంగా టిడిపి సభ్యత్వ నమోదు**

**పెద్దకడుబూరు,అక్టోబరు 26,ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు ఉన్నంత గౌరవం ఏ పార్టీలో లేదని కార్యకర్తల కృషి వల్లే నేడు టిడిపి అధికారంలో ఉందని సభ్యత్వం తీసుకున్న ప్రతి టిడిపి కార్యకర్తకు రూ.5లక్షల భీమా వర్తిస్తుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి అన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. రూ.100లు చెల్లించి కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన టిడిపి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జెండా పట్టుకుని ధైర్యంగా ముందుండి పనిచేశారని ఆయన కొనియాడారు. అత్యధికంగా కార్యకర్తలు ఉన్న పార్టీ టిడిపినే అని కార్యకర్తల కోసం సిఎం చంద్రబాబునాయుడు,మంత్రి నారా లోకేష్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేస్తున్నారన్నారు. కార్యకర్తలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తామంత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అన్ని గ్రామాల్లో వందశాతం సభ్యత్వ నమోదు పూర్తి చేసి జిల్లాలోనే పెద్దకడుబూరు మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులను కోరారు. సభ్యత్వ నమోదులో కార్యకర్తలు నిర్లక్ష్యం చేయకుండ ప్రతి కార్యకర్త రూ.100లు చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకుంటే పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

